క్లుప్తంగా

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం ఏడుగురికి కొవిడ్ టెస్టులు చేయగా, అందరికీ నెగెటివ్ వచ్చిందని టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. 12 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించారు.

నేడు, రేపు అంతర్జాతీయ సమావేశం

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలోని ఇంగ్లిష్ విభాగం, నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్(ఎన్‌టీఎం) సెంటర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సహకారంతో రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆ విభాగం హెడ్ ప్రొఫెసర్ షాహీన్ బుధవారం తెలిపారు. 'భాష, సాహిత్యం యొక్క విభజనలను అన్వేషించడం' అనే అంశంపై ఈ సమావేశం సాగుతుంది. గురువారం ఉదయం 11 గంటలకు ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ఈ సమావేశాన్ని ప్రారంభిస్తారు. పరిశోధనా ఫలితాలు, అనుభవాలను పంచుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు.

26 నుంచి చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో 'బాలబృందావనం' పేరిట చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. ఈ క్యాంప్‌లో పాల్గొనేందుకు 9 నుంచి 14 ఏళ్లలోపు వారికే అవకాశం. కార్యక్రమంలో పాల్గొనేవారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలి.

మహ్మద్ అమీర్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూలో ఇస్లామిక్ స్టడీస్ పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీని ప్రకటించారు. మహ్మద్ అమీర్ ఇస్లామిక్ స్టడీస్ విభాగం హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫాహీమ్‌అక్తర్ పర్యవేక్షణలో ఎన్విరాన్‌మెంటల్ పొల్యూషన్-యాన్ ఇస్లామిక్ పర్స్‌పెక్టివ్' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

సిగ్నల్ వ్యవస్థను బాగుచేయండి

కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌లోని సిగ్నల్ లైట్లను వెంటనే బాగు చేయాలని సీపీఎం నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. గత నాలుగు రోజులుగా సిగ్నల్ పనిచేయకపోవడంతో రోడ్డు దాటడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ట్రాఫిక్, టెక్నీషియన్స్ దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదన్నారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు శంకర్, బి. శ్రీను, నరసింహ, వెంకటయ్య, అశోక్, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ


రాక్‌గార్డెన్ స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

- రూ.రెండున్నర కోట్లతో రాక్‌గార్డెన్
- లింక్ రోడ్డుతో ట్రాఫిక్ సమస్యకు చెక్

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుంది. అమీన్‌పూర్-బొల్లారం రోడ్డుకు అనుసంధానంగా నవ్య రోడ్డును కలుపుతూ పాత గ్రామం ఇవతలి నుంచి ప్రత్యేక రోడ్డు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం కావాల్సిన నిధులు సమకూరుస్తున్నారు. భారత్ పెట్రోల్ పంప్ నుంచి భరత్‌నగర్ మీదుగా నవ్య వెళ్లే రోడ్డులో యాక్సిస్ పాపహోమ్స్‌కు సమీపంలో లింక్‌ను ఏర్పాటు చేయనున్నారు. లింక్ రోడ్డు ఏర్పాటుతో కిష్టారెడ్డిపేట మీదుగా లింగంపల్లికి ప్రయాణికులు సులువుగా రాకపోకలు సాగించవచ్చు.

రూ.రెండున్నర కోట్లతో పనులు..

సర్వే నంబర్ 993లో మహిమ మినిస్ట్రీస్ వెనకవైపు రాక్‌గార్డెన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. రూ.రెండున్నర కోట్లతో లింక్ రోడ్డు ఫార్మేషన్, రాక్‌గార్డెన్ ఏర్పాటు చేయనున్నారు. అమీన్‌పూర్ పాత గ్రామం మీదుగా ప్రస్తుతం రాకపోకలు సాగిస్తుండగా పెట్రోల్ పంప్ వైపు నుంచి భరత్‌నగర్ మీదుగా ఏర్పాటు కానున్న రోడ్డుతో ప్రయాణికులు అమీన్‌పూర్ పాత గ్రామంలోకి వెళ్లాల్సిన అవసరం లేకుండానే రాకపోకలు సాగించవచ్చు. దీంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు ఉండవు. భవిష్యత్‌లో గ్రామంలోని పాత ఇళ్లను కూల్చి రోడ్డు విస్తరించాలనే సమస్య ఉత్పన్నం కాదు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

అమీన్‌పూర్‌లో ప్రధాన రోడ్లను అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. అందుకోసం ప్రణాళికలను రూపొందిస్తున్నాం. నవ్య-అమీన్‌పూర్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అమీన్‌పూర్ -లింగంపల్లి రోడ్డుకు రూ.ఏడున్నర కోట్లు మంజూరయ్యాయి. మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.

– తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్, అమీన్‌పూర్

హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు


వైద్య శిబిరంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్ పటేల్, యాత్రికులు

రాయదుర్గం: కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రిలో హజ్ యాత్రికులకు రాష్ట్ర హజ్ కమిటీ, రంగారెడ్డి జిల్లా వైద్యవిభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు, వ్యాక్సినేషన్ ప్రక్రియను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కాగా ఈ శిబిరంలో 50 మంది పరీక్షలను చేయించుకున్నారు. కార్యక్రమంలో కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్, హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ నిజాముద్దీన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సృజన, డీఐఓ డాక్టర్ స్వర్ణ, జిల్లా ఆస్పత్రి డాక్టర్ మూర్తి, నాయకులు కృష్ణగౌడ్, రమేష్‌పటేల్, బలరామ్‌యాదవ్, చాంద్‌పాషా, తిరుపతిరెడ్డి, రజనీకాంత్ పాల్గొన్నారు.

వరదనీటి కాలువ పనుల పరిశీలన


భాగ్యనగర్ ఫేజ్-3లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ ఫేజ్ 3లో చేపడుతున్న వరద నీటి కాలువ నిర్మాణ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద పీట వేశామని, వరద నీటి కాలువ, యూజీడీ, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలియజేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగుండా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. డివిజన్ అభివృద్ధికి తన శాయశక్తులు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, శ్రీధర్, విజయకృష్ణ, కెయస్ఆర్, మోహన్‌రావు, విజయ్‌భాస్కర్, బ్రహ్మ శేఖర్, వినోద్, సురేంద్ర, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు కృషి చేయాలి

హెచ్‌సీయూ అసోసియేట్ ప్రొ.డాక్టర్ షీలా సూర్యనారాయణన్


మాట్లాడుతున్న షీలా సూర్యనారాయణన్

రాయదుర్గం: హక్కులు, వనరులు, ప్రాతినిధ్యం వంటి మూడు ముఖ్యమైన పద్ధతులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విమెన్స్ స్టడీస్ సెంటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షీలా సూర్యనారాయణన్ పేర్కొన్నారు. మహిళా సాధికారిత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్మనీ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ నిర్వహించిన రిటర్నింగ్ ఎక్స్‌పర్ట్ ఈవెంట్‌లో ఖాట్మండు 'ఫెమినిస్ట్ డెవలప్‌మెంట్ పాలసీ (ఎఫ్‌డీపీ)పై ఆమె ప్రత్యేక ఉపన్యాసం చేశారు. విద్యార్హత, శ్రామిక శక్తి భాగస్వామ్యం, హింస, రాజకీయ భాగస్వామ్యం, కుమారుల ప్రాధాన్యత ఫలితంగా బాలికలు, మహిళలపై వివక్ష చూపడానికి ఆస్కారం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌లో గురువారం ఉదయం 9 గంటలకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ రూ.406.30 లక్షల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దీనబంధు కాలనీలో రూ.49.50 లక్షలతో, హనుమాన్ నగర్ కాలనీలో రూ.22.50 లక్షలతో, ప్రగతినగర్ కాలనీలో రూ.45 లక్షలతో, పాపి రెడ్డి నగర్ కాలనీలో రూ.131.50 లక్షలతో, ఆస్‌బెస్టాస్ కాలనీలో రూ.65 లక్షలతో, పాపారాయుడు నగర్‌లో రూ.92.80 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని పాశమైలారం గ్రామంలో కొనసాగుతున్న దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో బుధవారం పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, ఇస్నాపూర్ ఎంపీటీసీ శ్రీశైలం, ఇస్నాపూర్ సర్పంచ్ బాలమణి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం


రామ్‌నరేష్ నగర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న రవికుమార్ యాదవ్ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ రామ్‌నరేష్ నగర్‌లో గడప గడపకూ బీజేపీ కార్యక్రమం బుధవారం జరిగింది. మేడ్చల్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు హరీష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జానకి రామరాజు, సీనియర్ నాయకులు చారి, అరుణ్‌కుమార్, నవీన్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్, రాజారెడ్డి, సునీల్‌రెడ్డి, రామరాజు, భద్ర, సీతారామరాజు పాదయాత్రలో పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారంలో నాయకుడు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ హామీలను గాలికి వదిలివేయటం బీఆర్‌ఎస్‌కు షరా మామూలేనన్నారు. నాయకులు అంబాదాస్, శ్రీహరి, మాధవ రెడ్డి, ప్రబాకర్ శర్మ, రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, మురళీ, చందు, రాములుగౌడ్, శ్రీనివాస్, బాలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడ, సఫారీనగర్‌లో..

రాయదుర్గం: కొత్తగూడ, సఫారీనగర్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. కొండాపూర్ డివిజన్ కొత్తగూడ, సఫారీనగర్‌లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేదని, సంవత్సరాల నుంచి పెన్షన్లు ఇవ్వలేదని, శ్మశాన వాటికలను పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చలేదన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రానుందని సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు యాదయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, యాదయ్య, జయరామ్, శ్రీహరి, కిరణ్, జగన్, కృష్ణ, ప్రకాశ్, కిరణ్, గోపాల్, పద్మ, రేణుక పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా హోర్డింగ్‌ల ఏర్పాటు

ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు


హైమాస్ట్‌లైట్‌కు అడ్డంగా భారీ హోర్డింగ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇష్టానుసారంగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెల్లాపూర్ నుంచి కొల్లూర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్డు పక్కన అనేక చోట్ల భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల వీచిన గాలులకు హోర్డింగ్‌లకు ఉన్న ఫ్లెక్సీలు విద్యుత్ తీగల మీద పడ్డాయి. అదే రోడ్డు మీద పడి ఉంటే ఎంత ప్రమాదం జరిగి ఉండేదో అర్థం చేసుకోవచ్చు. నిత్యం రద్దీగా ఉండే ఏలియన్స్ చౌరస్తాలో గతంలో ప్రమాదాలను నియంత్రించేందుకు ఐమాస్ట్ లైట్లను, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటికి అడ్డంగా భారీ హోర్డింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హోర్డింగ్‌లకు అనుమతులు ఇవ్వకూడదని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ నాయకుల పాదయాత్ర

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డి కాలనీ, వాంబే బస్తీ, సందయ్య నగర్‌లలో బీజేపీ రాష్ట్ర నాయకులు గజ్జెల యోగానంద్ మంగళవారం రాత్రి పాదయాత్ర చేశారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో బీజేపీకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి అధ్యక్షులు రాజుశెట్టి, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి కాంచన కృష్ణ, నాయకులు సత్య కురుమ, శ్రీనివాస్, రఘు , బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలి

నిజాంపేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో జరిగే ప్రజాగర్జన వాల్ పోస్టర్‌ను బుధవారం సీపీఐ నాయకుడు యాదయ్యతో కలిసి బాచుపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా గర్జన సభకు పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగ్యమ్మ, నర్సమ్మ, యాదమ్మ, లక్ష్మి, నాగమణి, పుష్పమ్మ, అమృత పాల్గొన్నారు.


మైత్రీనగర్ ఫేజ్ 3లోని పార్కు


వృథాగా క్రీడా పరికరాలు


ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

నిరుపయోగం.. మైత్రీనగర్ పార్కు

- కనీస వసతులు ఏవి..?
- పిచ్చిమొక్కలతో నిండిన పార్కు
- పట్టించుకోని అధికారులు


పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు

హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలోని మైత్రీనగర్ ఫేజ్ 3లోని పార్కు నిరుపయోగంగా మారింది. పచ్చదనం మచ్చుకైనా కానరాకపోగా కనీస వసతులు సైతం లేవు. పార్కులో పిచ్చిమొక్కలు, చెత్త చెదారం పేరుకుపోయింది. ఇందులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. గతంలో ఈ పార్కుకు ప్రహరీగోడ లేక ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని కథనాలు వెలువడినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించారు.తర్వాత అప్పటి నుంచి ఇప్పటి వరకు దీన్ని పట్టించుకోలేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు నగరంలోని పార్కులను అభివృద్ధి చేస్తున్న క్రమంలో మైత్రీనగర్ కాలనీ ఫేజ్ 3లోని పార్కును కూడా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. సాయంత్రం వేళ ఆహ్లాదం కోసం ప్రజలు సేదతీరడానికి పార్కులకు వెళ్తుంటారు. స్థానికంగా ఉన్న పార్కు అందుబాటులో లేకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లాల్సివస్తోందని వాపోతున్నారు.

- పార్కులో కనీస వసతులు కల్పించడంతో బాటు వాకింగ్ ట్రాక్‌ను పునఃనిర్మించాలి
- పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి పచ్చదనం పెంపొందించాలి.
- ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలి
- మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలి
- పార్కులో మంచినీటి ట్యాంకును నిర్మించాలి
- ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి. కాలనీ వాసులు సేదదీరడానికి పార్కు ఎంతో ఉపయోగం. పార్కులో కనీస వసతులు కల్పించాలి. పచ్చదనంతో నింపి ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా అధికారులు కృషి చేయాలి.

–అనంత్, మైత్రినగర్ కాలనీవాసి

పార్కును వినియోగంలోకి తేవాలి



వేసవి కాలం సాయంత్రం సమయాలలో చిన్న పిల్లలతో సేదతీరడానికి వస్తే పార్కు అధ్వానంగా ఉంది. పిచ్చి మొక్కలతో నిండిపోయింది. వెంటనే పార్కును ఉపయోగంలోకి తీసుకురావాలి. అలాగే పార్కుల్లో చిన్నారుల కోసం వివిధ రకాల ఆట వస్తువులను ఏర్పాటు చేయాలి.

–శంకర్, మైత్రినగర్

హైపర్‌టెన్షన్‌పై అవగాహన, ర్యాలీ

రాయదుర్గం: కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ), గ్లెన్‌మార్క్ ఫార్మా ఆధ్వర్యంలో బుధవారం హైపర్‌టెన్షన్‌పై అవగాహన,వాకథాన్ నిర్వహించారు. ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఈ కార్యక్రమాన్ని ఉదయం 7 గంటలకు నిర్వహించగా వైద్యనిపుణులు, 150 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైపర్ టెన్షన్‌తో పోరాడడానికి, నివారణ చర్యగా శారీరక శ్రమను ప్రోత్సహించే లక్ష్యంతో 2.5 కిలోమీటర్ల వాకథాన్ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ విఎస్ రామచంద్ర మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా దాదాపు ప్రతి ముగ్గురిలో ఒకరిని ఇది ప్రభావితం చేస్తుందన్నారు.దాదాపు 50 శాతం మందికి వారి పరిస్థితి గురించి తెలియదనే భయంకరమైన నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తున్నామన్నారు. 18 ఏళ్ల వయస్సు నుంచే గుర్తింపు, పర్యవేక్షణ అవసరమని ఆయన సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భిక్షాటన చేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని రాక్‌గార్డెన్ వద్ద కొంతకాలంగా 45ఏళ్ల వ్యక్తి భిక్షాటన చేస్తున్నాడు. అనారోగ్యంతో బుధవారం రాక్‌గార్డెన్ వద్ద మృతి చెందాడు. టౌన్‌షిప్ హోంగార్డుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవ్.. 9మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన తొమ్మిదిమందిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జడ్జి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పరిధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు.

ఎవరికీ చెప్పకుండా...

అమీన్‌పూర్ ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం...రాఘవేంద్ర కాలనీకి చెందిన లక్ష్మి కూతురు భవాని(19)ని రెండు నెలల క్రితం చేవెళ్లకు చెందిన ఈశ్వర్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ నెల 17వ తేదీన భవానికి జ్వరం రావడంతో అల్లుడు అత్తకు ఫోన్ చేసి విషయం చెప్పగా, కుటుంబ సభ్యులు చేవెళ్ల వెళ్లి భవాని తీసుకొచ్చి ఆస్పత్రిలో చూపించారు. అప్పటి నుంచి పుట్టింటిలోనే ఉంటుండగా, ఈ నెల 22 వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృశ్యంపై తల్లి లక్ష్మి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూటీకి వెళ్లిన మహిళ..

అమీన్‌పూర్ ఎస్ఐ సుభాష్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని గండిగూడేనికి చెందిన నాగ సబిత(34) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. పదేళ్ల క్రితం భర్త వదిలివెళ్లిపోయాడు. ఈ నెల 22వ తేదీన డ్యూటీకి వెళ్లిన సబిత తిరిగి రాలేదు. తన సోదరి అదృశ్యమైందని మహేష్‌కుమార్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్‌ఆర్ కేంద్రం ప్రారంభం


ట్రిపుల్‌ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో రీయూజ్, రెడ్యూజ్, రీసైకిల్ కేంద్రాన్ని బుధవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులు, దుస్తులు, పుస్తకాలను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో ఇవ్వాలని స్థానికులకు సూచించారు. సేకరించిన వస్తువులను అవసరమైన పేదలకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు జ్యోతి, చిట్టి, రవీందర్‌రెడ్డి, శ్రీశైలం , నాయకులు శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.